

భాగవతుల సుబ్రహ్మణ్యం

పత్రికల్లో వస్తూన్న సీరియల్స్‌ను సీరియస్‌గా చదివేసిన ఉత్సాహంలో, తానూ కలం పట్టి ఎలాగైనా ఓ సీరియల్ రాసెయ్యాలన్న స్థిరసంకల్పానికి వచ్చేశాడు దస్తగిరి.

కొంతకాలంగా అతడు వివిధ పత్రికల్లో వస్తూన్న సీరియల్స్‌ని... ముఖ్యంగా పాపులర్ రైటింగ్స్‌ను ఫాలో అవుతూన్నాడు.

ఏతావతా తేలిందేమిటంటే...

'సీరియల్' అనే ఓ అద్భుత రచనా ప్రక్రియ, తెలుగువాళ్లు బాగా పెంచి పోషిస్తూన్న మహా అవలక్షణ సమన్వితమైన 'పేజెస్ ఫిల్లర్' అని!

"అటునవలకుండే సమగ్రతా లేక —ఇటు పెద్ద కథ కుండే విషయవివరణాత్మకతా లేక కేవలం ... సస్పెన్స్ —థ్రిల్స్ —కొంత సెక్సూ — మరికొంత వయొలెన్సూ కూరి పాఠకుల మీదకి వారం వారం వంతులమీద వదిలే మేటర్ నే సీరియల్ అందురు" అని ఓ నిర్వచనం కూడా నిర్ధారించుకున్నాడు దస్తగిరి.

దాంతోపాటు మరో సంగతి కూడా గ్రహించాడతడు.

కేటగిరీల కింద విభజించి, ఆయా నవలా సీరియల్స్‌కే సైన్సుఫిక్షన్ అనీ; ఇన్ఫర్మేటివ్ రచన అనీ; ఇన్వెస్టిగేటివ్ కళాఖండమనీ ఇత్యాది రకర

కాల కోటింగులు అద్దడానికి ఏ విధమైన పరిశ్రమా— పరిశోధనా అవసరం లేదనీనూ... అసలలాంటివి ఉండటమే ఓ డిస్క్వాలిఫికేషననీనూ...

మరియు——

ముఖ్యంగా, ఆయా రంగాల్లో సమాచారాత్మక సీరియళ్లంటూ తెగ ఊదర గొట్టి రాసేస్తూన్న వాళ్లంతా అసలే రంగంలోనూ నిష్ణాతులు కాకపోగా కనీసం ప్రాథమిక పరిజ్ఞాన శూన్యులనీనూ కూడా బోధపడిందతడికి.

రాశులకొద్దీ రాసిపారెయ్యడానికి జబ్బసత్తువా ప్లస్ వాట్ని వేయించుకోడానికి ఎడిటర్ల వెంటపడగలిగే చేవా ఉంటే చాలునన్న సంగతీ అవగతమైంది.

'క్వాలిటీ కంట్రోల్' అనే బ్రహ్మపదార్థం వెతకొద్దుగాక వెతక్కూడదని —అసలా ఊహే రైటర్ని పురిట్లోనే సంధి కొట్టించేసే పెనుప్రమాదకరమైన ఆలోచన అనీ గ్రహింపున కొచ్చింది.

ఇన్ని విషయాలు బోధపడగానే దస్తగిరికి ముందస్తుగా కొంతత ధైర్యం వచ్చేసింది.

దీన్నో ప్రొఫెషన్‌గా భావిస్తూ బతకనేర్చిన వాళ్లెవరూ లేరనీ అసలు రచనని సీరియస్‌గా తీసుకునే వాళ్లే లేరనే —తీరిక దొరికినపుడు తోచిందేదో రాసేసి తోసేస్తున్నారనీ దస్తగిరి పఠనానుభవం తేల్చిన పరమసత్యం.

ఈ 'సత్యదర్శనం' కాగానే, అతడిలో నిద్రపోతూన్న రైటర్ కీ విధంగా జ్ఞానబోధ కలిగింది——

"ఎవర్నయినా ఇంప్రెస్ చెయ్యడం కోసం రాస్తే, అది చెత్తరచన అవుతుంది. అలాక్కాక దేన్నో ఎక్స్‌ప్రెస్ చెయ్యడంకోసం రాస్తే అది మంచి రచన అవుతుందని అమెరికన్ రైటర్ వైల్డర్ మహాశయుడు అన్నట్టు గుర్తు. ఈ మహత్తర వాస్తవాన్ని పాతాళానికి పాతేసి కేవలం — 'ఆంధ్రుల ఆహ్లాద అభిమాన పాఠక శిఖామణుల్ని అలరించేసి ఉద్ధరించే సెయ్యడానికే' ఈ సీరియల్ నవల్లు రాయడమనేది జరుగుతోంది"— ఇదీ అతడిక్కలిగిన జ్ఞానోదయం.

అలా కలిగినతక్షణం, ఠకీ మని లేచి కూర్చొని కాగితాల దస్త్రం ముందేసుక్కూర్చున్నాడు దస్తగిరి —అద్భుత అలౌకిక అపరిమిత (ఇంకా ఏయే విశేషణాలున్నాయోఅవన్నీ ఇక్కడ చేర్చుకొందుకుగాక!) సీరియల్ రచనా ప్రక్రియకి శ్రీకారం చుట్టిన వాడై.

దస్తగిరి బయోడేటా సూక్ష్మంగా నైనాఇక్కడ ఇవ్వడం సముచితం. లేదంటే— అతడు బాగా తలనెరిసినవాడో, అనుక్షవజ్ఞుడైన మేధావో అని పఠితలు అపోహ పడే ప్రమాదముంది.

దస్తగిరి ఎస్సెస్సీ ఎన్నిసార్లు రాశాడన్న విషయం అతడే మర్చిపోయేడు— క్లాసులెగ్గొట్టి చూసిన సిన్మాలెన్నన్నదీ కూడా మర్చిపోయినట్టే!

పవరు తక్కువ పంచాయతీ నేతల పంచెకొంగులు పట్టుకుని లోకల్‌పాల్టిక్సులో కొన్నాళ్లు తిగిరి —ప్రజాసేవ అచ్చిరాక, పైలావచ్చీసు



టీచర్ : ఒరే చెన్నా ! నన్నయ్య కవిత్వం ఎలా రాశాడురా ?

చెన్నా : చేతులతోనే టీచర్ !

—కె. చంద్రారెడ్డి
జెడ్. పి. హెచ్. ఎస్., సంగుసూరు

వయసులో "మనకెందుకులే ఈ యావ?!" అనుకుని అర్థాంతరంగా అదీ వటలేశాడు. (రాటుదేలిన ఓ ఎగస్పార్టీ యువజన బుల్లి లీడరు,'మళ్లీ ఇటు ఈ రాజకీయాల వైపు తలెత్తి చూస్తే షేపులు మారి పోతాయి' అంటూ హెచ్చరించడం హిడెన్ ట్రూతు అంటారు కొందరు.)

పాతికేళ్లొచ్చినా, తాడు బొంగరం లేనివాడవడం వల్ల —పిల్లనిచ్చే సాహసం ఏ 'బహుబాలికా కుటుంబీకుడూ' లేదా ఏ ఆడపిల్లల తండ్రీ' చెయ్యనందున దస్తగిరి ఇంకా బాచిలరే! వేళకింత తిండి పడెయ్యడం మినహా, అతడి గురించి పట్టించుకోని తల్లిదండ్రులుండగా —అతడికి దిగులెందుకూ —దండగ!సంతాన త్రయంలో మధ్యముడూ దస్తగిరి.

తీరుబడిగా రెంటెడ్ లైబ్రరీల వెంటా —శాఖా గ్రంథాలయాల వెంటా తిరుగుతూ వాటికి మహారాజపోషకుడైనాడు. ఇంచుమించు అన్ని పత్రికల్లోని సీరుయల్స్ గతపదేళ్లుగా చదువుతూన్నాడు. ఫలితమే —రైటర్‌గా అవతరించాలని కమిటైపోవడం.

రాయాలన్న నిర్ణయమైతే జరిగిపోయింది గాని —సబ్జెక్ట్ ఏది తీసుకోవాలన్నదే అతడి ముందున్న సమస్య ఇప్పుడు ... (ఎలా ప్రారంభించాలనేది —అంటే 'కృత్యాద్యవస్థ' అనేది అతడికి సమస్య కాకపోవడం అతడి అదృష్టం. మనకి ఆశ్చర్యం!)

బాగా వరసపెట్టి సినిమాలు చూసిన అనుభవంతో, అతడికి స్ఫురించిన ఎవరెడీ 'లవ్'. సృష్ట్యాది నుంచీ ఎవర్‌గ్రీన్ సబ్జెక్టు సైతం 'ప్రేమే' మరి!

ఇంతవరకు ఎవరెవరెన్నెన్ని ప్రక్రియల్లో ప్రేమని గుప్పించారో, ఎన్ని వందలకోట్ల కాగితాల మీద ప్రేమ ఇతివృత్తంగా చిత్రించారో అంచనా వెయ్యడం కష్టమే!'ప్రిజమ్' కెన్ని కోణాలున్నాయో చెప్పొచ్చుగాని, ప్రేమ కెన్ని కోణాలో చెప్పడం ఎవరితరమూ గాదు. అయినప్పటికీ —వాటిలో ఏ ఒక్కటీ మిగల్చకుండా అన్ని కోణాల్నీ స్పృశించారు రచయితలు. ప్రపంచ భాషలన్నిటా అసంఖ్యాక ప్రేమైక రచనలే వెలువరించిన వాళ్లూ ఉన్నారు.

ఇక —ఆ సబ్జెక్టు మీద ఏది రాసినా, అది అంతకుముందెక్కడో ఎవరో స్పృశించినట్టే ఉంటుంది తప్ప 'అరె! కొత్తగా ఉందే' అన్పింపచేయడం కష్టం!

ప్రపంచం మొత్తం మీదనే ఇంత ఎంగిలి సబ్జెక్టు మరోటి లేదు గాక లేదు! అయినా సరే! .... యంగ్ రైటర్ల నుంచి సీనియర్ రైటర్ల దాకా దీన్నే ఎందుకింకా సబ్జెక్టుగా ఎంచుకుంటున్నారూ అంటే —దానికొకే ఒక్క జవాబు ... ఏ ఇతర విషయం తీసుకున్నా, దానిమీద ఏకాగ్రతత ఉండాలి. విషయ పరిజ్ఞానం ఉండాలి!.... రైటర్ లెయిన్‌లో రాయడానిక్కుదర్దు! అదే లవ్ సబ్జెక్టయితే మహా ఆషామాషీగా రాసెయ్యొచ్చు!

అంచేత——

ఏవేవో ఆశయాలూ; బోల్డన్ని నీతులూ; అద్భుత సందేశాలూ ఇంలాటి బరువు బాధ్యతలను వేటినీ తమ తొలినవల నెత్తిన వెయ్యకుండా, సన్నసన్నగా ప్రేమ ఇతివృత్తంతో— తన జిమ్మిక్కుల ట్రిక్కుల బలంతో నెట్టుకు రావాలనుకున్నాడు దస్తగిరి —మరీ 'చాదస్తగిరి' గాకుండా.

ఫలితమే "ప్రేమికులకో చివరి బలి" నవలావతరణం.

"తెలుగు వారపత్రికల్లో అత్యధిక ఉత్తమ సర్క్యులేషన్ గల వారపత్రిక అని ప్రతిసంచికా టైటిల్ పేజీమీద ప్రచురించుకునే ఓ వీక్లీ 'సీమరాణి'కి ఉన్న లార్జెస్ట్ సర్క్యులేషన్‌ని దృష్టిలో పెట్టుకుని తమ అపురూప నవలా రాజాన్ని అందులోనే సీరియలైజ్ చెయ్యడానికి ఉపక్రమించాడు దస్తగిరి.

దానికి ఎడిటరైన వసంత రాయుడును ఆఫీసులో —అతడి ఛాంబర్లోనే స్వయంగా కలిసి తన పరిచయం చేసుకున్నాడు.

నవల మొత్తం నాలుగొందల పేజీలూ ఆయన చేతిలో పెడుతూ —"సార్! ఇదో బృహన్నవల" అన్నాడు నాందిగా.

"కావచ్చు! కాని ఆ పదప్రయోగమే అంతబావుండలేదు! పొరపాటున 'వ'కారం మింగేస్తే, బృహన్నల సౌండిస్తోంది. అయినా నువ్వు సీరియల్ రచనల గురించి పెద్దగా స్టడీ చేసినట్టు లేదే! ఈ రోజుల్లో మొత్తం నవలంతా ఒకేసారి రాసి తీసుకొస్తారటయ్యా ఎవరైనా? సీరియల్ అనేది వాయిదాల మీదా— ఎడిటర్ల దగ్గర నుంచి పదేపదే వచ్చే కబుర్ల మీదా రాస్తుండాలి!"

"అయ్యో! నాకా సంగతి తెలీక కాదండీ! అదంతా పాపులర్ రైటర్ల విషయంలో కాబోలు అనుకున్నాను"

"ఇదసలే పోటీ ప్రపంచం కదా! మార్కెట్లో ఇతర పత్రికలు ఏవీ వెయ్యడానికి సాహసించని వాటిని మనం వేస్తూంటాం! అంచేత ముందుగా మా దగ్గరి కొచ్చి సినాప్సిస్ ఇచ్చి —రెండు మూడు సిట్టింగుల్లో చర్చించి —మనకీ మనకీ ఓ అవగాహన కుదిరాక అప్పుడు రాయడం మొద

లెట్టాలి. ఓ నాలుగు వారాలకి సరిపడా మేటర్ పోగయ్యాక చెప్తే, మేం పాఠకుల్ని ఊరించేలా పబ్లిసిటీ ప్రారంభిస్తా మన్నమాట! అలా ఓ నాలుగు ఇష్యూల్లో వేసేసరికి రైటర్ దగ్గర మరో నాలుగు సంచికలకి సరిపడా మేటర్ 'స్టాండ్‌బై' లో వుంటుంది. అదీ సీరియల్ రచనా విధానం — ఇప్పటి రోజుల్లో...''

"మరేం చెయ్యాను సార్! ఈసారి కిలా కానివ్వండి!"

"సాయంత్రం కల్లు కాంపౌండ్ దగ్గరికి రారాదూ? మద్యనిషేదం కాదు గానీ; మనలాటి వాళ్ల మీదకొచ్చిపడింది! లేకుంటే హాయిగా ఏ త్రీ ఏసెస్ బార్‌లోనో కలిసేవాళ్లం! ఇప్పుడిక ఓపెనెయిర్ కల్లుపాకలే గతి!"

అబ్బే? నేను తాగను సార్!"

"నువ్వు తాగితే ఎంత? తాక్కపోతే ఎంత? మనకి చుక్కపడనిదే ఏ సంగతీ చెవికెక్కదు".

"సరి! సరి! అర్థమైంది!"

"నీబొంద! అప్పుడే ఏమైంది? ఇదే నీ మొదటి రచన అంటున్నావ్ కనుక —అందులో గుణాల కంటే దోషాలే ఎక్కువగా ఉంటాయ్! వాటిని సర్దుకొచ్చేసరికి నాతలప్రాణం తోకొచ్చినంతవుతుంది. ఆ శ్రమకి ప్రతిఫలంగా ఓ చిరుకానుకే దైనా... ఎట్ ఓ ఫ్రిజ్జో —కూలరో... నీ యిష్టం!"

"ఆఁ!" అని నోరుతెరుచుకుని అలాగే ఉండిపోయిన దస్తగిరి "అయితే, కొన్ని పత్రికల సీరియళ్ల రాకడ వెనక ఇంత తతంగం ఉంటుందన్నమాట!" అనుకున్నాడు.

"సరే! సర్లేండి! నైటికు రెడీగా ఉండండి" అనేసి బైటికొచ్చేశాడే గాని,దస్తగిరికి ఏం చెయ్యడానికే పాలుపోవడం లేదు.

తన దగ్గర దమ్మిడీ లేదు. గిఫ్ట్ మాట అటుంచి, వసంతరాయుడు పోయించమన్న కల్లు చుక్కకి పైసలెక్కడ దేబెరించడం అనే ఆలోచన పట్టుకుంది.

ఇహ ఏదైతే అదయింది లెమ్మని, తెగించేసి రాత్రి పది గంటల ప్రాంతంలో తన మిత్ర బృందాన్నంతటినీ వెంటేసుకుని సాయుధ సైన్యంతో వసంత రాయుడి ఇంటి మీద పడ్డాడు.

"ఇదుగో రాయుడూ! మర్యాదగా చెప్తున్నా! సీరియల్ వేశావా సరేసరి! లేదా రేప్పొద్దున్న స్కూలు కెళ్లిన నీ పిల్లలు ఇంటికి తిరిగి రారు. షాపింగ్ కెళ్లే మీ ఆడాళ్ల మొఖాన యాసిడ్ కురుస్తుంది. ఏం తేల్చుకుంటావో నీ యిష్టం!" అంటూ బెదిరించాడు దస్తగిరి.

"ఈ దాదాగిరీ ఏంటయ్యా?"


"దాదా గిరి కాదు! దస్తగిరీ అను"

"ఏదో గూండా గిరి!"

"నోనో! ... ఇలాంటి వాళ్లతో ఇదే తీరు కిరికిరి"...

"బాబ్బాబూ! నోరు తడపకపోతే పోయేవ్! మనం మరో రూట్లో అండర్ స్టాండింగ్ కొద్దాం! కాస్త చెయ్యి తడపవయ్యా!"

"అద్గో! మళ్లీ అదే కూతా?" గద్దించిచైన్ ఝుళిపించాడు దస్తగిరి అనుచరుడొకడు.



కుమారుడు : నాన్నగారూ ! ఒకటి పెద్దదా ? 40 పెద్దదా ?

తండ్రి : 40 ఏ పెద్దది. ఎందుకు ?

కుమారుడు : మా క్లాసులో నాకు 40 వ ర్యాంక్ వచ్చిందిలే... !

—ఎస్. విశాలి, తూ. గో. జిల్లా

నిజంగా —అన్నంత పనీ చేసేలా ఉన్నాడని భయపడ్డ వసంతరాయుడు "సర్లె! నీ నవల ఇలా తే!" అన్నాడు నీరసంగా.

"రేపొచ్చే ఇష్యులోనే దీనికి పబ్లిసిటీ ప్రారంభం కావాలి! ఖబడ్దార్! ... లేదో ... ఇందాకే చెప్పాంగా!" అనుచరగణంలోని మరో భారీ కాయం ఉరిమింది.

నవల టేబుల్ మీద గిరాటేసి, బయటిక్కదిలారు వాళ్లు.

"బతుకు తెరువు కోసం ఉద్యోగం చెయ్యవయ్యా ఎడిటరూ! అంతేకాని, అంతరాత్మని చంపుకొని బతక్కు!" అంటూ ఓ వీరలుక్కిచ్చాడు దస్తగిరి.

'ప్రేమికులకో చివరి బలి' నవల సీరియల్‌గా రాసాగింది పాఠకులకో నిత్య బలి ఫీలింగ్‌ని కలుగచేస్తూ.

అయినప్పటికీ —రకరకాలుగా పాఠకుల్ని ఇన్వాల్వ్ చేసేలా 'ఈ నవల్లో ఫలానా పాత్రకి పేరు పెట్టండి' అనీ, 'దీని ముగింపు మీరే చెప్పండి' అనీ ఎన్నో ఉపశీర్షికలు జోడించి 'అశేష పాఠకాదరణ పొందిన నవల'గా ముద్ర వేయించుకోడానికి బోల్డంత 'శ్రమ' పడ్డాడు దస్తగిరి.

అంతేనా?! సీరియల్ జరుగుతూన్నన్నాళ్లూ 'సందేహాలూ —సమాధానాలూ' తానే వండీ — వార్చీ; తన మిత్రులవే ఇళ్ల పేర్లూ —ఊళ్ల పేర్లూ మార్చి మార్చి ముఖాముఖీలు నడిపాడు.

ఉదాహరణకి —"మీ దృష్టిలో ఈ సీరియల్ ప్రత్యేకత ఏమిటి?" అనే ప్రశ్నా, దానికింద "ప్రస్తుతం ఏ వారపత్రికలోని ఏ సీరియల్‌తో పోల్చినా ఇది నెంబర్ వన్ అనిపించకోగలగడం" అనేది జవాబు. (దేంట్లో నెంబర్‌వన్? రచన స్థాయిలోనా? ఉత్తమ ప్రామాణిక విలువల్లోనా? శైలీ శిల్పం ఇత్యాదిలక్షణాల్లోనా అని మాత్రం అడక్కండి)

దస్తగిరి సీరియల్ ఇలాగే పలు విధాల బాక్స్ ఐటమ్‌లతోనూ ప్రశ్నోత్తరాల ఉపశీర్షికలతోనూ సాగిసాగి ఏడాదిన్నర నడిచింది.

ఎనభై వారాలు దాటేసరికి పత్రిక సర్క్యులేషను గ్రాఫు బాగా పైకెళ్లిపోయింది (ట)!

ఆ ధాటికి బెజవాడ పబ్లిషర్లో ఇద్దరు పోటీలు పడుతూ దస్తగిరి దగ్గర కొచ్చి "బాబ్బాబూ! నీ బృహత్తర సీరియల్ రాజాన్ని నవలగా బుక్‌గా పబ్లిష్ చేసే భాగ్యం మాకే ప్రసాదించు" అంటూ కాళ్లా వేళ్లా పడ్డారు.

అప్పటికే టిక్కుల్లో —మేజిక్కుల్లో ఆరితేరిపోయిన దస్తగిరి, "ఎవరు హెచ్చు మొత్తం ఇవ్వజూపితే వారికే ఇచ్చేస్తా!" అన్నాడు.

"ముందుగానేవచ్చితి" అంటూ 'చెంచా పబ్లిషర్స్' అధినేత చెంబు చార్వాకుడు ఉత్సాహపడితే, "మునుముందుగ ఇతడ్ని నే జూచితి" నంటూ 'తొండా పబ్లికేషన్స్' ఓనర్ తొంగరాల డాకయ్య పాండవోద్యోగ విజయాలు నాటకంలో దుర్యోధనుడిలా మీదిమీది కొచ్చాడు.

వాళ్లిద్దరూ అక్కడో ఫైటిసీన్ క్రియేట్ చెయ్యక ముందే దస్తగిరి తగువు తీర్చేశాడు —"అనవసరంగా మీరూ మీరూ కొట్టు కోవద్దు! ప్రస్తుతం నా పేరు, ఆ మధ్య పాశర్లపూడి బ్లో అవుట్ అంత బ్రహ్మాండంగా వెలిగిపోతోంది. అస్సలు నేనీ నవలని డైరెక్ట్‌గా నా సొంత సంస్థ దస్త్రం పబ్లికేషన్స్ పేరిట ప్రచురించుకోదలిచాను ..." అంటూ వాళ్లను పంపించేశాడు. బోల్డంత రాయల్టీ ఆశ చూపించగా "నెక్స్ట్ నవల మీకే ఇస్తాన్లెండి!" విడివిడిగా చెరో వాగ్దానం దయచేశాడు.

నిజానికి —వసంతరాయుడు తనకిచ్చిన కోపరేషన్‌కి ప్రత్యుపకారంగా ఏదైనా చెయ్యాలనుకున్న దస్తగిరి, తానే ఐడియా అండ్ మేజర్ షేరూ ఆఫర్ చేసి, లోపాయికారీగా రాయుడి భార్య పేరిట ఓ పబ్లికేషన్ ఫర్మ్ ఓపెన్ చేయించాడు. తన కొచ్చిన పాపులారిటీతో —ఆ సంస్థ ప్రచురించే సీరియలైజ్డ్ నావెల్స్‌కి గిరాకీ ఎక్కువయ్యే పథక రచన చేశాడు.

వివిధ పత్రికల్లో దస్తగిరి వెలువరించే సమస్త నవల్లూ గుత్తగా ఆ సంస్థ మాత్రమే ప్రచురిస్తూంటుందన్న మాట!

దస్తగిరి ఎడాపెడా రెండు చేతులూ —రెండు కాళ్లతోనే కాక, డబ్బు వెదజల్లి ఘోస్టుల్నీ —భూతాల్నీ —రాక్షసుల్నీ (అంటే —రాక్షసప్పని లేదా బండ చాకిరీ ఇన్ ఘోస్టు రైటింగ్ అన్నమాట.) కూడా పురమాయించి రాసేస్తూన్న తరుణం అది.

కేవలం దస్తగిరి పేరునే క్యాష్ చేయబూనారు కొందరు. మరికొందరు కేవలం అతడి సీరియల్ వేయడం కోసమే పత్రికలు పెట్టసాగారు. కాదనకుండా ఒప్పేసుకుని వార్ని నొప్పింపక —తానొవ్వక సుఖం మరిగిన దస్తగిరి, తన భూత రచయితలతో రాయించేసి తిరుగులేని విధంగా విరాజిల్లుతున్నాడు.

ఏ పత్రిక తిరగేసినా —అతడి సీరియల్ నడుస్తూండడమో ; ఇంకా ప్రారంభం కావలసి ఉండడమో; త్వరలో మీ అభిమాన రచయిత దస్తగిరి సూటిగా మీ హృదయాల్లోకి దూసుకుపోయేందుకొస్తున్నాడనే ప్రకటనలు ఫుల్ పేజీల్లో ఉండటమో సర్వసాధారణమై పోయింది.

ఒకటా? ... రెండా? ... ఎన్ని కమిట్ అయ్యాడో అతడికే తెలీదు. దాదాపు డజనున్నర పత్రికలు. అందులో డజను దాకా వీక్లీలే! వారానికి పన్నెండు నవలలు కేవలం సీరియల్స్ కోసమే రాయాలి! పైగా ... జిమ్మిక్కులూ, ఉత్తరాలూ నానా మసాలాలూ సరేసరి! ఏయే పత్రికలకి రాస్తున్నాడో తానే చెప్పలేని స్థితి ... గుర్తు లేని స్థితి ... ప్రతి పత్రికాఫీసులోనూ ఓ అటెండరు కుర్రాడు ప్రత్యేకంగా దస్తగిరి చుట్టూ తిరగడానికే అపాయింట్ అయ్యాడంటే, పరిస్థితి ఎంత వరకూ వెళ్లిందో ఎవరైనా ఇట్టే గ్రహించెయ్యొచ్చు! విక్ర మార్క్ పట్టుదల్లాగ దస్తగిరి వెంటబడి ఏ వారా నికా వారం మేటర్ సాధించుకురావడమే అతడి పని.

"ఈ పూట రాయలేదు —రేపు రావయ్యా! మరీ తప్పదంటే మిడ్‌నైటొచ్చేసి మేటర్ తీస్కెళ్లు!" అన్నా, కిమ్మనకుండా డ్యూటీ చేసే టైపు వ్యక్తుల్నే సదరు పత్రికాఫీసుల వాళ్లు నియ మించుకున్నారు —దస్తగిరి సంగతి తెలిసి.

దిగ్రేట్ దస్తగిరినే ఆదర్శంగా —ప్రేరణగా తీసు కుని అవే టైపు నవలలు రాయడం కోసం మరో ఆరు డజన్ల మంది దుకాణాలు తెరిచారు. వాళ్ల దగ్గర నుంచి సరుకుని చెంచా పబ్లిషర్స్ వగైరాలు కళ్లకద్దుకొని పట్టుకుపోసాగారు.

పదపదార్థ చర్చలూ —పదబంధాల సొబ గులూ ఆస్వాదించే పూర్వపుతరం, జీవన సంధ్య వైపు జారిపోతుంటే ——తేలికపాటి తెలుగు ధాటికే తట్టుకోలేని, చేవ తగ్గిన నాజూకుతరం ఈ నవలా రాజాలే అపూర్వ సాహిత్యమని భ్రమిసి పోవడం ప్రారంభించింది.

ఫలితం ... పాపులర్ రైటర్ పట్టం; సాహిత్య సమ్రాట్ బిరుదం సునాయాసంగా దస్తగిరి కైవస వయ్యాయి.

'లిటరరీ దగుల్బాజీతనం'లో చెయ్యి తిరిగిన దస్తగిరి చేతులకే సువర్ణ హస్త ఘంటా కంక ణాలూ; తన ఐరన్‌లెగ్‌తో ఇతరుల్ని నిర్దాక్షిణ్యంగా పాతాళానికి తొక్కేసిన ఈ 'రచనా వానమ మూర్తి' కాలికే గండ పెండేరాది సన్మానాలూ కాకా సంస్థల స్వలాభాపేక్ష మేరకు సజావుగా సాగిపోయాయి.

కాని —

విమర్శ అనే మూడో కన్ను ఎప్పుడైనా, ఎక్క డైనా కాలానికీ —వ్యక్తులకీ అతీతంగా తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉంటుంది. దాన్ని 'రాస్తా రోకో' చెయ్యడం ఎవరి తరమూ కాదు గదా!

దస్తగిరి ఉత్పాదనల పాలిట విమర్శకు విల నుడై 'నిశితాక్షుడు' విరుచుకుపడ్డాడు. చెలరేగిపో యాడు.

నిశితాక్షుడు లేఖినీ సంధానం —చాలనం మొత్తం సాహితీ ప్రపంచంలోనే సంచలనం సృష్టించింది.



ప్రశ్న : డాక్టర్ గారూ ! నాకు రాను రాను మతిమరుపు ఎక్కువ అవుతోంది ! నిన్న మీ దగ్గరికి రావడానికి బదులు వకీలు దగ్గరకు వెళ్ళానంటే నమ్మండి !

జవాబు : రేపైనా మీరు డాక్టరు గారి దగ్గ రికి వెళ్ళండి... ఎందుకంటే నేను ఇంజనీర్ని.

—శ్రావణ్, తిరుపతి

"పెను నిద్దర పోతూన్న మొద్దు ముఖాల్లారా! సాహిత్యమనేదానికి అర్థమైనా తెలీని అధమా ధమ దద్దమ్మల్లారా! అరపేజీ పొడుగు సమా సాలు చదవకపోతే పోయె —అరడుగులెంగ్త్ సెంటెన్సు సైతం చదవలేని అర్భకులారా!" అంటూ భాషాభిమానం లేని పాఠకుల్నీ —విలువ తక్కువ రచనల్ని నెత్తికెత్తుకునే కుహనా విమర్శ కుల్నీ ఏకిపీకి పాకం పట్టి వదిలిపెట్టాడు.

"ఆ పదప్రయోగాా లేంట్రా చవటా! ఆహ్లాదత, సెక్సటం, ఏతత్ ఫలితంగా, పరిశోధనారంగానికీ, బుల్ డోజరీకరించబడిన ... (ఇటీవలి కొందరు ప్రముఖ రచయితల పుస్తకాల్లో ఈ పదాలు చూడ గలరు) ... ఇలాంటి వ్యాకరణ దోషభూయిష్టమైన రాతలూ నువ్వూనూ! మీకు సర్టిఫికేట్లు ఇచ్చిన వాళ్లంతా మీ నవలల్లో బోలన్ని 'సాహితీ విలువ' లున్నాయంటున్నారు. (కనీసం ఇది వైరి సమాస మనైనా వారికి తెలుసో! లేదో!) 'తంత్రులకు తేనె పూశారమో! ఎంత మధురంగా ఉందీ గానహేల' అనిపించేలా మీ భావవీణని మీటండి —అంతే తప్ప, చేతబడి దృశ్యాలూ; రహస్యాంగ వర్ణ నలూ; వాంఛాజ్వలిత ఉద్రేకాలూ ఇవా రాతలు? 'రాయకపోతే బతకడం కష్టం!' అన్నంత వేదన మీకు కలిగినపుడే రాయండి! తేలికయిన భాషలో రాయొద్దని అనడంలేదు. అలాగని 'ప్రాకారార్ణవ గర్భరత్న రుచిర ప్రాశస్త్య పాదోజ్వల ధీకంజాత పరిమళోల్లసిత విస్తీర్ణాగ్ని' లాంటి సుదీర్ఘ సమా సాలూ —హై సౌండింగ్ వర్డ్సూ వెయ్యాలని అన డం లేదు. రైటర్లలో కొందరీ నాడు ఎంత త్వరగా 'ఈజీ మనీ' సంపాదించేసి జేబులు నింపుకొం దామా అనే యావలో పడి, ఎవరి మటుక్కు వాళ్లు బిజీగా ఉన్నారు. ఇలాంటి రైటర్లకు ఏదన్నా చెప్పబోతే వినరు సరిగదా! అడ్డదిడ్డ మైన ఆర్గ్యుమెంట్సు. కాబట్టి ఈ 'సాహితీ కాలు ష్యాన్ని' తట్టుకొనే టీకామందు ఎవరో ఒకరు వేస్తే చాలదు! విమర్శకులారా! ఏకంకండి!' లోక కల్యాణ భానోదయమునకై పరితపించకున్న, సత్కవియె అతడు?' అని ప్రశ్నించుకుని మరీ పొగడండి! ఈటెల్లాంటి మాటల్తో సాహితీ విమర్శ చేసి నిర్భయంగా సాహిత్యంలో భ్రష్టాచారాల్ని తూర్పార బట్టిన అలనాటి అక్కిరాజు ఉమా కాంత విద్యాశేఖరుల వార్ని స్ఫూర్తిగా తీసు కోండి! నాటి కవులూ —రచయితలూ (1920 — 1945) కృష్ణశాస్త్రి, పంచాగ్నుల, కట్టమంచి, జయంతి రామయ్య, విశ్వనాథ ... ఏ సాహితీ కారుడ్ని వదిలి పెట్టలేదాయన. విమర్శకులు నిజాయితీపరులు కాకపోవడం వల్లనే తెలుగు సాహిత్యానికి నష్టం జరిగింది. గుణ దోష విచా రణ రెండూ జరగకపోవడమే దారుణం. 'ఏమి తిని సెపితివి కపితము?' అంటూ సాక్షాత్తూ 'పెద్దన్న'నే విమర్శతో ఢీకొని ఈసడించిన వ్యంగ్య విదూషక రామలింగని వాళ్లుంటే తప్ప —ఈ వికృతపు రాతలు రాసేవాళ్లు ఆగేట్టు లేరు ..." అంటూ విమర్శకుల మీద విమర్శ కురిపిం చాడు.



లత : ఏమిటి శీనూ నా కళ్ళలోకి అదేపనిగా చూస్తున్నావు?
శ్రీను : ఏం లేదు, ఒక కంట్లో లక్ష మరో కంట్లో లక్ష కనపడుతుంటేనూ.
లత : ఆ!

నిశితాక్షుడి రాతల వల్ల నైతేనేమి? ఆయన ఛెర్నాకోల ఝుళిపింపులకీ —పెను పిలుపులకీ కదిలిన విమర్శక సైన్యం వీర విహారం చేసింది.

తెలుగునాట 'సాహిత్యం' పేరిట చెలామణీ అయిపోతూన్న అన్ని సాహితీ ప్రక్రియలనీ అతని సాయుధ లేఖిని తాకింది.

మొత్తం మీద నిశితాక్షుడి సునిశిత వైఖరి ఫలిం చింది. పాఠకుల హృదయాల మీద ప్రతిఫలిం చింది.

మార్పు ఎవరిలో రావాలో వాళ్లలోనే వచ్చింది —అదో ప్రవాహమై నిరంతరం సాగాలే కాని ...

పాఠకుల్లో 'దమ్ము'ంది. చెత్త 'రాస్తా' నంటూ ఎవరు తయారైనా, వాళ్లను 'రాస్తారోకో' చెయ్య గల చేవ ఉంది. అది ఎగసిపడే తరంగంలాగ — అందరి అంతరంగాల్లోనూ ఒక్కసారే ఉవ్వెత్తున లేవాలి! లేదంటే —ఇలాంటి సాహిత్యమే మిగు ల్తుంది మరి! అని పాఠకలోకం గ్రహించింది.

దస్తగిరి ఇప్పుడా తరహా సాహిత్యం రాయ డమే మానేసి, శాస్త్ర సాంకేతిక సమాచారాత్మక రిఫరెన్స్ పుస్తక రచనా ప్రచురణ చేపట్టడం అందుకో తార్కాణం. ●